క్లుప్తంగా

సంగారెడ్డి టౌన్ ఎస్‌ఐగా మహమ్మద్ సర్దార్



సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి టౌన్ ఎస్‌ఐగా మహమ్మద్ సర్దార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఈయన వికారాబాద్‌లో పని చేశారు. బదిలీపై సంగారెడ్డికి వచ్చారు.

సింగూరుకు పెరుగుతున్న వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. దీంతో రెండు రోజుల నుంచి 11 నంబర్ గేట్ ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి డ్యాంలోకి 11వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతే నీటిని వదులుతున్నారు. జలవిద్యుత్ కేంద్రంలో రెండు టర్బయిన్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టులో 29.9 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగతాది దిగువకు వదులుతున్నారు.

ఎంఈఓగా రాథోడ్ బాధ్యతల స్వీకరణ



ఎంఈఓను సన్మానిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం మండల విద్యాధికారిగా పీపీ రాథోడ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆయనను సన్మానించారు. అనంతరం రాథోడ్ మాట్లాడుతూ ..నిత్యం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఎంఈఓ జెమినికుమారి, ఉపాధ్యాయ సంఘం నాయకులు జలీల్, భాష్య, ఎలీస్‌రాణి, మండల నోడల్ అధికారి రాములు ఉన్నారు.

మరుగుదొడ్ల పరిశీలన



మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని మరుగుదొడ్లను కార్మికులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. మరుగుదొడ్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు.

రైల్వేస్టేషన్‌లో ‘స్వచ్ఛతా హీ సేవ’



శుభ్రం చేస్తున్న మాధవ కృష్ణ తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం డీడీఎస్–కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ మాధవకృష్ణ, స్థానికులతో కలిసి పారిశుద్ధ్య పనులు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయి ప్రియాంక ‘స్వచ్ఛతా హీ సేవ’ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్ల గురించి వివరించారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ధర్నా



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

కంది(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అక్షయపాత్ర కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, వారి బంధువులు మంగళవారం కందిలోని అక్షయపాత్ర ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముగ్గురు కార్మికులు విధులకు హాజరు అయ్యేందుకు వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెంది, 3 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు వారికి అక్షయపాత్ర యాజమాన్యం ఆర్థిక సహాయం చేయలేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ, సీఐ అశోక్‌కుమార్ ధర్నా వద్దకు చేరుకొని మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేసేందుకు అక్షయపాత్ర యాజమాన్యం ఒప్పుకోవడంతో ధర్నాను విరమించారు.

సాగుకేది భరోసా?

- పీఎంఎఫ్‌బీవై పథకాన్ని తిరిగి ప్రారంభించాలి
- ప్రీమియం చెల్లింపు నిలిపేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మునిపల్లి(అందోల్): ఆరుగాలం కష్టపడి పండిస్తున్న వివిధ రకాల పంటలు భారీ వర్షాల కారణంగా దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోతుందని వాపోతున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి (పీఎంఎఫ్‌బీవై) శ్రీకారం చుట్టింది. భారీవర్షాలు, ఈదురు గాలులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టం జరిగితే రైతులకు పరిహారం అందేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ప్రీమియం, మిగతాది రైతులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పంట నష్టం జరిగినప్పుడు బాధిత రైతులకు పరిహారం అందేది.



నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఐదు సంవత్సరాలుగా..

ఖరీఫ్ సీజన్ పంట సాగు ప్రారంభంలోనే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఏటా 90 శాతం ప్రీమియం చెల్లించేవి. కాని 5 సంవత్సరాలుగా ప్రీమియం చెల్లింపులో నిర్లక్ష్యం వహించడంతో పథకానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. బీమా చేస్తే పంట నష్టం వాటిల్లినప్పుడు అధికారులు క్షేత్ర స్థాయికి వచ్చి అంచనాలు వేసి బాధితులకు బీమా అందేలా చర్యలు తీసుకునే వారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో వివిధ రకాల పంటలు సుమారు 7, 22, 920 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

ఆదుకోవాలి



భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలి. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని పునరుద్ధరించి పంట నష్టపరిహారం అందేలా చూడాలి.

–బుడిదపతి విఠల్ ,ఎటిగట్టసంగ్యం

వివరాలు సేకరిస్తున్నాం..



భారీ వర్షాలతో దెబ్బతిన్న వివిధ రకాల పంటల వివరాలను సేకరించాలని మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎప్పటికప్పుడు పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులది

- ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్

జోగిపేట(అందోల్): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టులు వీరోచితంగా పోరాడారని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు వి.ఆనంద్ అన్నారు. మంగళవారం జోగిపేటలో ప్రజానాట్యమండలి శౌర్యయాత్రలో భాగంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాటిక ప్రదర్శన తొలి ఆంధ్ర మహాసభ జరిగిన జోగిపేట క్లాక్ టవర్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. రైతుల పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సాయుధ రైతాంగ పోరాట నాటిక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయిలు, పీఎస్ఎం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణం ,అంజనేయులు, జిల్లా ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు అంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి వినోద్, చంద్రమౌళి, శివ, అందోల్ డివిజన్ నాయకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



వీధి నాటక ప్రదర్శన

డీలర్ల సమస్యల పరిష్కారానికి సహకారం

- ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అమలు చేస్తామని ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దశాబ్దాల చరిత్ర కలిగిన రేషన్ డీలర్ల సంఘానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా ఐదు వేల రూపాయల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ అందించాలని కోరుతూ త్వరలోఅన్ని జిల్లాల డీలర్ల సంఘం అధ్యక్షులతో సీఎం రేవంత్‌రెడ్డిని కలవనున్నట్లు వివరించారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్‌కు రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ , ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జాతీయ అధ్యక్షుడు కృష్ణమూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వంభర్, వివిధ జిల్లాల నుంచి రేషన్ డీలర్లు హాజరయ్యారు.

చెరువు అలుగు కట్టను కాపాడండి



ఇరిగేషన్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు

పటాన్‌చెరు టౌన్: చెరువు అలుగుకట్టను కాపాడాలని రామేశ్వరంబండ గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులను కోరారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని కమ్మినేని చెరువు అలుగుకట్టను తవ్వి వెంచర్ నిర్వాహకులు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారని తెలిపారు. కత్వ కాలువ తెగడం వల్ల చెరువులోకి నీళ్లు రావడం లేదన్నారు. ఒకవైపు హైడ్రా అధికారులు ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఎఫ్‌టీఎల్‌లను పరిరక్షిస్తుంటే.. గ్రామంలో దీనికి విరుద్ధంగా చెరువు అలుగు కట్టను కబ్జా చేసి రోడ్డు వేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామేశ్వరంబండ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



సీమంతాలు చేస్తున్న లలితకుమారి

నారాయణఖేడ్: గర్భిణిలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి లలితకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఖేడ్ మున్సిపాలిటీ కార్యాలయ సమవేశ మందిరంలో పోషణమాసంలో భాగంగా ఖేడ్, మనూరు మండలాల పోషణమహోత్సవం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, బాలింతలకు అన్నప్రాసన, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితకుమారి తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, సీడీపీఓ సుజాత, ఆయా మండలాల అంగన్‌వాడీల సూపర్‌వైజర్లు, టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ తయారీపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పర్యావరణానికి మేలు చేసే ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు తక్కువ విద్యుత్‌ను వాడుకొని ఎక్కువ కాంతిని ఇచ్చేవిగా ప్రసిద్ధి చెందినవని రిసోర్స్ పర్సన్, రాష్ట్ర ఎన్‌జీసీ ప్రాజెక్టు అధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు 50 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సంప్రదాయేతర ఇంధన వనరులను వాడుకొని పర్యావరణాన్ని కాపాడాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో సీఎంఓ వెంకటేశం, ఏఎంఓ అనురాధ, డీఎస్ఓ సిద్ధారెడ్డి, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త మాధవరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కౌన్సిలర్లు లచ్చిరాంనాయక్, బాలాజీ, మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కలిసి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెల్ యాజమాన్యం విద్యుత్‌నగర్ కాలనీలో పలు రోడ్లను మూసివేశారని తెలిపారు. అలాగే, కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను నిలిపివేయించారని చెప్పారు. అదే విధంగా మున్సిపాలిటీలో నిధుల కొరత ఉందని తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడి ఆదివారం కాలనీకి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఆజీం, డైరెక్టర్లు యూసఫ్, జోసెఫ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలు పార్టీ చేరారు. అనంతరం ఇంటింటికి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మి, సురేష్, ప్రసాద్, జగన్ పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



రైతుతో మాట్లాడుతున్న ఏడీఏ భిక్షపతి, శాస్త్రవేత్త విజయ్‌కుమార్

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి పరిధిలో దెబ్బతిన్న కంది పంటను మంగళవారం వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, శాస్త్రవేత్త విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ నెల 21న సాక్షి దినపత్రికలో ‘కంది’ పోయిన రైతు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు కంది పంటను పరిశీలించి, కౌలు రైతు నాగేశ్వర్‌రావుతో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కంది పొలంలో నీరు నిలిచిన కారణంగా ఫ్యుజేరియం, ఫైటోఫోరా శిలింధ్రాల వల్ల ఎండు తెగులు ఆశించిందన్నారు. తెగులు తీవ్రత వల్ల మొక్కలు ఎండిపోయాయని తెలిపారు. ఎండు తెగులుకు మాంకోజెబ్ 3 గ్రాములు లేదా మెటలాక్సిల్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొదళ్లు బాగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. పంట దెబ్బతిన్నందున పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని రైతు నాగేశ్వర్‌రావుకు అధికారులు భరోసా ఇచ్చారు. అధికారుల వెంట ఏఈఓ స్రవంతి, బీటీఎం చరణ్ తదితరులు ఉన్నారు.

కొత్త రుణాలు మంజూరు చేయండి

- డీసీసీబీ సీఈఓకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న పాలకవర్గం సభ్యులు

వట్‌పల్లి(అందోల్): ఉమ్మడి అల్లాదుర్గ్, రేగోడ్ మండలాల పీఏసీఎస్ సొసైటీ పరిధిలోని వట్‌పల్లి మండలానికి సంబంధించిన 16 గ్రామాల రైతులకు కొత్త పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ ఖాదిరాబాద్ పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు మంగళవారం డీసీసీబీ సీఈఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి మండలాల సొసైటీల పరిధిలో రుణాలు పొందినప్పటికీ వట్‌పల్లి నూతన మండలంగా ఏర్పాటు కావడంతో ఉమ్మడి సొసైటీల సర్వీస్ ఏరియా నుంచి 16 గ్రామాలను తొలగించారు. కాని, కొత్త సొసైటీ ఏర్పాటు చేయడం లేదా ఇతర సొసైటీ పరిధిలోకి బదలాయింపు జరగలేదన్నారు. నాలుగేళ్ల క్రితం ఖాదిరాబాద్ పీఏసీఎస్‌కు జరిగిన ఎన్నికల్లో ఓటువేసినప్పటికీ ఆ సొసైటీ ద్వారా కొత్త రుణాలు అందకపోగా, ఉమ్మడి సొసైటీ ద్వారా కూడా రుణాలు అందడంలేదన్నారు. వెంటనే వట్‌పల్లి మండలంలోని 16 గ్రామాల రైతులకు సంబంధించి ఉమ్మడి సొసైటీల్లో ఆస్తి, అప్పులను ఖాదిరాబాద్ సొసైటీ పరిధిలోకి బదలాయింపు జరిపి కొత్త రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఖాదిరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, వైస్ చైర్మన్ శ్రీశైలం, డైరెక్టర్లు బుద్ధిరెడ్డి, అభిలాష్‌గౌడ్, యాదయ్య, సీఈఓ శ్రీకాంత్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత వైద్య శిబిరం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొని మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం గోప్యానాయక్ తండాకు చెందిన సర్దార్‌నాయక్‌కు ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి చెక్కు మంజూరయింది. సంబంధించిన చెక్కును మంగళవారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారుకు అందజేశారు.

◆ క్లాస్ ఉద్యోగుల నియామకం చేపట్టాలి

జహీరాబాద్ టౌన్: క్లాస్ ఉద్యోగుల నియామకాలు చేపట్టాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ రఘు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1996 నోటిఫికేషన్ ప్రకారం ఎంపికైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పాలసీదారులు చెల్లిస్తున్న ప్రీమియంపై జీఎస్‌టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జీవిత బీమా(ఎల్‌ఐసీ) ఉద్యోగుల సంఘం జహీరాబాద్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ ఇందిరా మహిళా శక్తి టార్గెట్ పూర్తి చేయాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఇందిరా మహిళా శక్తి, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ టార్గెట్‌ను పూర్తి చేయాలని డీపీఎం జయశ్రీరాజ్ అన్నారు. మంగళవారం ఝరాసంగం మండలకేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఝరాసంగం , రాయికోడ్ మండలాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెల వరకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

◆ సమస్యలపై ప్రజాభవన్‌లో ఫిర్యాదు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం నస్తీపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాగి బోగుడ వెంకటరెడ్డి గ్రామంలోని పలు సమస్యలపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెరువు, కుంటలను ఆక్రమించి నిర్మించిన ఇళ్లను కూల్చేముందు హైడ్రా అధికారులు హెచ్ఎండీఏ పరిధిలోని ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లను ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన కంటి వెలుగు మాదిరిగా 40 ఏళ్లు నిండిన వారికి మోకాళ్ల నొప్పుల నివారణకు సర్వే చేసి, చర్యలు తీసుకోవాలని తెలిపారు.

◆ వ్యక్తి అదృశ్యం

న్యాల్‌కల్(జహీరాబాద్): మతిస్థితిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని రాంతీర్థ్ గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింహులు(41), గత కొంతకాలంగా మతి స్థితిమితం సరిగ్గా లేకుండా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 19న ఇంటి నుంచి వెళ్లిన నర్సింహులు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా, నాగిరెడ్డిపేట్ మండలం, గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన సాయిలు(47), సంవత్సరం క్రితం బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ మండలంలోని కిష్టారెడ్డిపేటకి వచ్చి, వాచ్‌మెన్‌గా పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 17న సరుకులు తెచ్చుకునేందుకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

◆ సామాజిక సేవతో యువతకు గుర్తింపు

జహీరాబాద్ టౌన్: సామాజిక సేవలో యువత భాగస్వామ్యం కావాలని ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామాల్లో శ్రమదానం, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

◆ అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

మునిపల్లి(అందోల్): మండలంలోని చిన్న చెల్మడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం బీహార్ ఐసీడీఎస్ అధికారుల బృందం సందర్శించింది. బృందం సభ్యులు అంగన్‌వాడీ సెంటర్‌ను కలియదిరిగి వంటి గది పరిసరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ల రోజువారి పని గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సదాశివపేట ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.

◆ చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు

వట్‌పల్లి(అందోల్): వరిలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాంగోపాల్ వర్మ , కిరణ్‌బాబు, సరిత అన్నారు. మంగళవారం అందోలు మండలం చింతకుంట గ్రామంలో రాజేంద్రనగర్, సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు సందర్శించారు. అధిక వర్షాల కారణంగా పంటలకు చీడ పీడలు ఆశించినట్లు గుర్తించారు. ముఖ్యంగా వరిలో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత గమనించారు.

◆ ఆలయాలను రక్షించాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఆలయాలను దేవాదాయ శాఖను తొలగించి ఆలయాల నిర్వహణ బాధ్యతను సాధుసంతులు, సనాతన ధర్మ పరిరక్షకులకు అప్పగించాలని మంగళవారం కల్హేర్‌లో తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు హిందూ ఆలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. హిందూ ఆలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న అన్యమతస్తులను తొలగించాలని, నూతన ఉద్యోగాల భర్తీలో అన్యమతస్తుల ప్రవేశాన్ని నిషేధించాలని కోరారు. గోహత్యపై కఠిన చట్టాలను తీసుకువచ్చి గోమాతను కాపాడాలని కోరారు.

◆ హామీలు నెరవేర్చండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారుడు నవాబు రాచిరెడ్డి మంగళవారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన 250 గజాల ఇళ్ల స్థలాల హామీని అమలు చేయాలన్నారు. పెన్షన్ రూ.25 వేలు ఇవ్వాలని కోరారు.

సమస్యలు పరిష్కారానికి కృషి



దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కంది(సంగారెడ్డి): కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26000లు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ సంగారెడ్డి క్లస్టర్ ఆధ్వర్యంలో కంది బస్టాండ్ వద్ద దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. జిల్లాలోని 1710 పరిశ్రమల్లో రెండు లక్షల మంది కార్మికులు పని చేస్తుండగా, వారిలో లక్షా 60 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. కనీస సౌకర్యాలు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేని పక్షంలో డీసీఎల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు భాగరెడ్డి, సురేష్, మల్లేష్ ,భీంరెడ్డి, ప్రవీణ్, సత్తయ్య, దావీదు, శివ, తదితరులు పాల్గొన్నారు.